సాక్షి అనకాపల్లి

ఆదివారం । 21 । జనవరి । 2024



గ్రామ స్వరాజ్యం సాకారం

చీడికాడ మండలంలో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు పలు అభివృద్ధి కార్య క్రమాలకు ప్రారంభోత్సవం చేశారు. 8లో



బాలాజీకి పుష్పార్చన

విశాఖ: శీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలో శ్రీ తిరుమల బాలాజీకి శనివారం పుష్పార్చన కనుల పండువగా జరిగింది.



సరిహద్దుల్లో చెక్‌పోస్టులు

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీస్ శాఖ జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తోంది. 8లో

న్యూస్‌రీల్

27న విశాఖకు సీఎం

- భీమిలిలో భారీ బహిరంగ సభ ఏర్పాటు
- నేడు స్థలాలను పరిశీలించనున్న వైవీ సుబ్బారెడ్డి, తలశిల రఘురాం



విశాఖ సిటీ: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 27వ తేదీన విశాఖకు వస్తున్నట్లు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర నుంచి ఎన్నికల శంఖారావం పూరించేందుకు భీమిలిలో 27వ తేదీన భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభను విజయవంతం చేసి ఎన్నికల శంఖారావానికి ఘన స్వాగతం పలుకుతామని చెప్పారు. ఈ సభకు అవసరమైన స్థలాల పరిశీలన కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త వై.వి.సుబ్బారెడ్డి, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం ఆదివారం విశాఖకు వస్తున్నట్లు వెల్లడించారు. లక్షలాది మందితో చేపట్టే సభకు స్థలాలను పరిశీలించడంతో పాటు చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్షిస్తారని తెలిపారు.

ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

తుమ్మపాల: డ్రగ్ డి – అడిక్షన్ సెంటర్‌లో మూడు ఖాళీ పోస్టులకు తాత్కాలిక ప్రాతిపదికన నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యాధికారి, కౌన్సిలర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు అర్హత గలవారు అన్ని సర్టిఫికెట్లను దరఖాస్తుకు జతపరిచి అనకాపల్లిలో తన కార్యాలయంలో ఈ నెల 30వ తేదీ సాయంత్రంలోగా అందించాలన్నారు. పోస్టులను ఓపెన్ కేటగిరీలో భర్తీ చేస్తామన్నారు. దరఖాస్తు ఫారాలను ఏఎన్ఏకేఏపీఏఎల్ఎల్ఐ.ఏపీ.జీవోవీ.ఐఎన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఆచార్య ప్రసాదరెడ్డికి అపూర్వ స్వాగతం



వీసీకి ఎన్‌సీసీ విద్యార్థుల గౌరవ వందనం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శనివారం పండగ వాతావరణం నెలకొంది. ఏయూ ఉపకులపతిగా ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి రెండోసారి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పరిపాలన భవనం వద్ద సందడి కనిపించింది. స్థానిక విద్యార్థులతో పాటు వివిధ దేశాలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి.. అపూర్వ రీతిలో స్వాగతం పలికారు. తమ అభ్యున్నతికి విశేష కృషి చేసిన ఆచార్య ప్రసాదరెడ్డిని వీసీగా రెండో పర్యాయం నియమించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ.. థ్యాంక్యూ సీఎం.. వుయ్ లవ్ వీసీ సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. బంగ్లాదేశ్, ఇండోనేషియా, సూడాన్, మాలి, ఇరాన్, టాగో తదితర దేశాలకు చెందిన విద్యార్థులు తమ దేశ సంప్రదాయ వస్త్రధారణలో విచ్చేసి వీసీని స్వాగతించారు. వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ప్రతీ విద్యార్థిని ఆప్యాయంగా పలకరించారు. అనంతరం ఎన్‌సీసీ విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహానికి పుష్పాలను అర్పించారు.

రేపు స్టీల్‌ప్లాంట్‌కు హాఫ్‌డే సెలవు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు సోమవారం హాఫ్‌డే సెలవు ప్రకటించారు. ఈ మేరకు యాజమాన్యం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం అయోధ్యలోని రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వంగా అన్ని సంస్థలు, పరిశ్రమలకు హాఫ్‌డే సెలవు ప్రకటించింది. ఇందులో భాగంగా ఉద్యోగులు మధ్యాహ్నం 2.30 వరకు సెలవు తీసుకోవచ్చని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జాతర జనసంద్రం





అమ్మ దర్శనానికి బారులు తీరారు.. భక్తిశ్రద్ధలతో రథోత్సవంలో పాల్గొన్నారు.. జాతర పిల్లాపాపలతో ఉత్సాహంగా గడిపారు.. అనకాపల్లి వేల్పులవీధిలో శనివారం జరిగిన గౌరీపరమేశ్వరుల జాతరలో వేలాదిమంది పాల్గొన్నారు. పూలదండల అలంకరణలో అమ్మవారి ఆలయం ఆకర్షణగా నిలిచింది. సాముగరిడీ, తప్పెటగుళ్లు, తోడపెద్దుసేవ, కాళీమాత నృత్యాలు, పులివేషాలు, దేవతామూర్తుల ఆకృతుల్లో ప్రదర్శించిన నేలవేషాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. – అనకాపల్లి

25 నుంచి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సర్వీసులు



గోపాలపట్నం: హైదరాబాద్–విశాఖ–హైదరాబాద్ మధ్య ఈ నెల 25 నుంచి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ నూతన సర్వీసులు ప్రారంభంకానున్నాయి. హైదరాబాద్‌లో సాయంత్రం 4.40 గంటలకు విమానం బయలుదేరి 6.05 గంటలకు విశాఖ చేరుకుంటుంది. సాయంత్రం 6.35 గంటలకు విశాఖలో తిరిగి బయలుదేరి రాత్రి 8 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. మంగళవారం, గురువారం, శనివారం, ఆదివారం ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయి.

జోరుగా.. హుషారుగా..

గోవాడ సుగర్స్ క్రషింగ్

- రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో చెరకు రైతులకు రూ.9.3 కోట్ల బకాయిల చెల్లింపు
- ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసేందుకు ఆసక్తి చూపుతున్న రైతులు



ఫ్యాక్టరీ ఆవరణలో రైతులు తరలించిన చెరకు

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ జోరుగా సాగుతోంది. ఈ ఏడాది ఫ్యాక్టరీ ఏరియాలో కొంత మేర చెరకు విస్తీర్ణం తగ్గడంతో చెరకు సరఫరాపై మొదట్లో కొంత ఆందోళన ఏర్పడింది. అయితే క్రషింగ్ ప్రారంభించిన 20 రోజుల్లోనే 45 వేల టన్నులు క్రషింగ్ చేయడంతో క్రషింగ్ లక్ష్యంపై ఆశలు చిగురించాయి. చెరకు సాగు తగ్గడంతో ఈ ఏడాది 2 లక్షల టన్నుల క్రషింగ్ లక్ష్యంగా పెట్టుకొని డిసెంబరు నెలాఖరున ఫ్యాక్టరీ రెగ్యులర్ క్రషింగ్ చేపట్టింది. ఇప్పటి వరకూ 20 పనిదినాల్లోనే 45 వేల టన్నులు క్రషింగ్ చేయగా సీజన్ సమయం ఇంకా మరో రెండు నెలలు పైబడి ఉండటంతో లక్ష్యాన్ని చేరుకుంటామనే ధీమా ఫ్యాక్టరీ వర్గాల్లో ఏర్పడింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం అందించిన సహకారంతో రైతుల్లో చెరకు సరఫరా చేసేందుకు మరికొంత ఆసక్తి చూపుతున్నారు. ఈ పరిణామం ఈ ఏడాది క్రషింగ్‌కు ఎంతో మేలు జరిగే అంశం. ఫ్యాక్టరీ ఆర్థిక ఇబ్బందుల రీత్యా చెరకు సరఫరా చేసినా పేమెంట్స్ ఇవ్వరేమోనన్న ఆందోళన మొదట్లో కొంత మేర రైతుల్లో ఏర్పడింది. అయితే రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎప్పటికప్పుడు రైతులను ఆదుకునే చర్యలు తీసుకోవడం కాస్త రైతులకు ఊరట కలిగించింది. తాజాగా ఈ ఫ్యాక్టరీ చెరకు రైతుల పాత బకాయిల చెల్లింపులు కూడా జరిగాయి. ఫ్యాక్టరీ ఆర్థిక ఇబ్బందుల వల్ల గత 2022–23 క్రషింగ్ సీజన్‌కు సంబంధించి రైతులకు సుమారు రూ.9 కోట్ల 30 లక్షల చెరకు బకాయిలు నిలిచిపోయాయి. దీనితో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గ్రాంట్‌గా వచ్చిన డబ్బులు చెరకు బకాయిలకు పూర్తిగా రైతుల ఖాతాల్లోకి ఫ్యాక్టరీ యాజమాన్యం జమ చేసింది. ప్రభుత్వం అందించిన సహకారంతో పాత బకాయిలు అందడంతో రైతుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గోవాడ చెరకు రైతులకు కేన్ పేమెంట్స్ కోసం ఇప్పటికే రూ.32 కోట్లు గత సీజన్లలో గ్రాంట్‌గా ఇవ్వగా తాజాగా మరో రూ.12 కోట్ల 30 లక్షలు గ్రాంట్‌గా ఇచ్చి రైతులకు, కార్మికులకు ప్రభుత్వం అండగా నిలిచింది. ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి నిలబెట్టుకోవడంపై చెరకు రైతులు, కార్మికులు సర్వత్రా కృతజ్ఞతలు వ్యక్తం చేశారు.

చెరకు రైతుల్లో ఉత్సాహం

ప్రభుత్వం అందించిన సాయంతో ఈ ఏడాది క్రషింగ్ సీజన్‌కు చెరకు సరఫరా చేసేందుకు రైతుల్లో ఉత్సాహంతో చెరకు సరఫరా చేసేందుకు ముందుకొస్తున్నారు. ఇప్పటికే కాటాల వారీగా పక్వానికి వచ్చిన చెరకుకు కటింగ్ పర్మిట్లు ఇచ్చే ప్రక్రియ కొనసాగుతుంది. మరో పక్క తాము చెరకు సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నామని రైతులు ముందుకొచ్చి కటింగ్ పర్మిట్ల కోసం ఫ్యాక్టరీ సిబ్బందిని కోరుతున్నారు. ఈ పరిణామం ఫ్యాక్టరీ క్రషింగ్‌కు కలిసొచ్చే అంశం. రోజుకు 2 వేల టన్నులకు మించే క్రషింగ్ చేయాల్సి ఉండగా అందుకు తగ్గట్టుగా చెరకు కూడా సరఫరా అవుతుంది. ఈ ఏడాది లక్ష్యం మేర క్రషింగ్ చేస్తేనే ఫ్యాక్టరీ రానున్న రోజుల్లో మనుగడ ఉంటుందని, లేనిపక్షంలో మిగతా ఫ్యాక్టరీల పరిస్థితే వచ్చే అవకాశం ఉందని అంతా ఆందోళన చెందుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రైతులు చెరకు సరఫరా చేసేందుకు మరింత ముందుకు రావడం శుభ పరిణామం. ఇదిలావుండగా చెరకు సరఫరా చేయడంలో కొంత జాప్యం చేస్తున్న రైతులకు కాకుండా సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని కోరుతున్న రైతులకు కటింగ్ పర్మిట్లు వెంటవెంటనే ఇస్తే ఫ్యాక్టరీకి కావలసినంత చెరకు సరఫరా అవుతుందని రైతులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో యాజమాన్యం పరిశీలన చేస్తే ఈ ఏడాది క్రషింగ్‌కు కావలసిన చెరకు పూర్తిగా సరఫరా కాగలదని రైతులు అంటున్నారు. ఆ దిశగా యాజమాన్యం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

మనసు మార్చుకున్నా..



నేను 2 ఎకరాల్లో చెరకు తోట వేశాను. మొదట ఈ ఏడాది ఫ్యాక్టరీకి చెరకు వేయాలా వద్దా అనే ఆలోచనలో పడ్డాను. ఇంతలో పాత బకాయిలు చెల్లించడానికి ఫ్యాక్టరీకి రూ.9 కోట్లు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సాయం చేశారు. వెంటనే మా రైతుల ఖాతాల్లోకి బకాయిలు జమ చేశారు. దీంతో గోవాడ ఫ్యాక్టరీకి నా చెరకు పూర్తిగా సరఫరా చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను.

– పాము అప్పలనాయుడు, చెరకు రైతు, వెంకన్నపాలెం

లక్ష్యం చేరుకుంటాం..



ప్రభుత్వం అందించిన సాయం వల్ల రైతుల పాత చెరకు బకాయిలు చెల్లించాం. ఈ ఏడాది అనుకున్న మేరకు క్రషింగ్ లక్ష్యం చేరుకుంటామనే ధీమా ఉంది. పాత బకాయిలు చెల్లించడంతో రైతులు కూడా చెరకు సరఫరా చేసేందుకు ఉత్సాహంగా ఉన్నారు. పక్వానికి వచ్చిన తోటలకు, రైతులు అడిగిన వెంటనే కటింగ్ పర్మిట్లు ఇచ్చేలా చర్యలు తీసుకున్నాం. క్రషింగ్ ఆశాజనంగా కొనసాగుతోంది.

–వి.వి.సన్యాసినాయుడు, ఎండీ, గోవాడ సుగర్స్

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్, విప్ ధర్మశ్రీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు

రోలుగుంట: చెరకు రైతుల బకాయిల చెల్లింపు కోసం ప్రభుత్వం రూ.9.3 కోట్లు మంజూరు చేయడంపై ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, పార్టీ యువజన శాఖ మండలాధ్యక్షుడు దోసపత్ని రాజు, చెరకు రైతులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం చెరకు కాటా వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చిత్రపటాలకు వారు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గోవాడ చెరకు రైతుల సమస్య తెలుసుకున్న విప్ ధర్మశ్రీ సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేశారన్నారు. ఈ సమస్య తీరడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కొప్పుల వెలమ స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ టి.వి. రమణ, రైతు నాయకులు చిటికెల వెంకటసత్తిబాబు, తమటపు సత్యంనాయుడు, ఉలబాల రాము పాల్గొన్నారు.

ఆగడాలకు కళ్లెం.. మహిళలకు రక్షణ కవచం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్



సమావేశానికి హాజరైన పలు శాఖల అధికారులు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్
- లైంగిక వేధింపుల నిరోధక చట్టం –2013పై అవగాహన

విశాఖ లీగల్: పనిచేసే ప్రదేశాల్లో మహిళలకు అన్ని విధాలుగా అండగా నిలవాలని, ఆహ్లాదకర, స్నేహపూర్వక వాతావరణంలో విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అధికారులకు సూచించారు. మహిళలను కుటుంబ సభ్యుల్లా చూసుకోవాలని, వారి హక్కులకు ఎట్టి పరిస్థితుల్లోనే భంగం కలిగించేలా ఎవరూ వ్యవహరించరాదని హితవు పలికారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం–2013పై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టు నూతన భవన సముదాయంలోని సమావేశ మందిరంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన చట్టం ఉద్దేశాలు, మహిళలకు కల్పించిన రక్షణ చర్యలను వివరించారు. చట్టం గురించి అధికారులందరూ తెలుసుకోవాలని, పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ఆయా కార్యాలయాల పరిధిలో అవగాహన సదస్సులు నిర్వహించి.. ఈ చట్టం గురించి విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పలువురు న్యాయ నిపుణులు తమ అభిప్రాయాలు, అనుభవాలను సదస్సులో పంచుకున్నారు. మెట్రో పాలిటిన్ సెషన్స్ జడ్జి ఎస్.శ్రీదేవి, కోర్టు రెండో అదనపు జడ్జి ఎం.వెంకటరమణ, ఇతర అదనపు న్యాయమూర్తులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వి.శేషమ్మ, సీనియర్ సివిల్ జడ్జిలు, పలువురు మేజిస్ట్రేట్లు, జిల్లా స్థాయి అధికారులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, న్యాయవాదులు, కోర్టు అధికారులు పాల్గొన్నారు.

సినీ గేయ రచయిత భారవికి వేటూరి పురస్కారం



పాయకరావుపేట: ప్రముఖ తెలుగు సినీ రచయిత, దర్శకుడు, పాటల రచయిత జె.కె.భారవికి వేటూరి పురస్కారం అందివ్వనున్నట్లు వేటూరి సాహితీ పీఠం, శ్రీ ప్రకాష్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ప్రకటించాయి. వేటూరి జయంతిని పురస్కరించుకుని ఈనెల 29న భారవికి పురస్కారం ప్రదానం చేయనున్నట్లు వేటూరి సాహితీ పీఠం వ్యవస్థాపక కార్యదర్శి కలగ రామజోగేశ్వరశర్మ తెలిపారు. ఇప్పటివరకు 12 మంది సినీ, సాహితీ రంగ ప్రముఖులకు వేటూరి పురస్కారాలను అందించామని, త్రయోదశ (13వ) వేటూరి పురస్కారానికి భారవిని ఎంపిక చేశామని తెలిపారు. వేటూరి సాహితీ పీఠానికి శాశ్వత గౌరవ అధ్యక్షులుగా తనికెళ్ల భరణి, వ్యవస్థాపక అధ్యక్షులుగా చక్కా సూర్యనారాయణ, అధ్యక్షులుగా సిహెచ్.వి.కె.నరసింహారావు వ్యవహరిస్తున్నారన్నారు. ఈ నెల 29న తుని పట్టణంలో గల చిట్టూరి మెట్రోలో ప్రదానోత్సవం నిర్వహిస్తున్నట్లు శ్రీ ప్రకాష్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు సిహెచ్.విజయ్‌ప్రకాష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కాపాడితే ప్రోత్సాహకం

జాతీయ స్థాయిలో ప్రాణదాతలకు రూ. లక్ష అవార్డు



కరపత్రాన్ని విడుదల చేస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఆర్టీవో అధికారులు

తుమ్మపాల: రహదారి ప్రమాదాల్లో క్షతగాత్రులను గోల్డెన్ అవర్ సమయంలో ఆస్పత్రి, ట్రామాకేర్ సెంటర్‌కు తరలించి ప్రాణాలను కాపాడిన వారికి రూ.5 వేల ప్రోత్సాహకంతోపాటు ప్రశంసా పత్రం ఇస్తామని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. స్థానిక కలెక్టర్ చాంబర్లో 'సురక్షితమైన రహదారి మీ జీవితానికి రక్ష' 'ప్రాణదాతల రక్షణ కోసం మార్గదర్శకాలు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీవో అధికారులతో కలిసి ఆయన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనంపై వెళ్లే ప్రతి ఒక్కరూ హెల్మెట్ పెట్టుకోవాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ తప్పక పాటించాలని సూచించారు. రోడ్డు ప్రయాణ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అతివేగం ప్రాణానికి ముప్పు అని, సురక్షితంగా ప్రయాణం చేయాలన్నారు. ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల హెచ్చరిక బోర్డులను గమనించి డ్రైవింగ్ చేయాలన్నారు. అత్యధికంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి వాటి నివారణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా ప్రమాదం వాటిల్లితే స్థానికులు తగిన సహాయ సహకారాలు అందించాలన్నారు. వారికి ఎటువంటి ఇబ్బంది ఉండబోదన్నారు. జాతీయ స్థాయిలో ప్రాణరక్షణకు సహాయం చేసిన వారికి లక్ష రూపాయల అవార్డు అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో బి.దయానిధి, జిల్లా రవాణా అధికారి కె.వి.ప్రకాష్‌రావు, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు మరో అవకాశం

విశాఖ విద్య: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే పదో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు మరో అవకాశం కల్పించినట్లు డీఈవో ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, జిల్లాలోని ఓపెన్ విద్య స్టడీ సెంటర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు. కోర్సు ప్రవేశ ఫీజుతో పాటు, రూ.1000లు అదనపు రుసుముగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రవేశాలు పొందిన వారికి జూన్ లేదా, జులై నెలలో వార్షిక పరీక్షలు ఉంటాయన్నారు.

క్లుప్తంగా

తుంపర్ల, బిందు సేద్యం పెంపునకు కృషి



అధికారులతో సమీక్షిస్తున్న లక్ష్మి

నాతవరం : ఈ ఏడాది లక్ష్యానికి మించి తుంపర్ల బిందుసేద్యం సాగు పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా సూక్ష్మ సాగునీటి వనరుల ప్రాజెక్టు డైరెక్టర్ ఈవీ.లక్ష్మి అన్నారు. ఆమె శనివారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది 1200 హెక్టార్లలో బిందుసేద్యం సాగు చేసేందుకు ప్రభుత్వం లక్ష్యం పెట్టుకుందన్నారు. ఇప్పటి వరకు 1500 హెక్టార్లలో బిందు, తుంపర్ల సాగుకు రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారన్నారు. వాటిలో 712 హెక్టార్లకు కలెక్టర్ నుంచి ఆమోదించినట్లు చెప్పారు. మిగతా దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం దశల వారీగా పరిపాలన ఆమోదం అందజేస్తామన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరికి గాయాలు



విశాఖ కేజీహెచ్‌లో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న శంకరరావు

దేవరాపల్లి : కాశీపురం సచివాలయం సమీపంలోని ప్రమాదకర మలుపు వద్ద శుక్రవారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో విజయనగరం జిల్లా వేపాడ మండలం వావిలపాడు గ్రామానికి చెందిన భూమిరెడ్డి శంకరరావు(40) తలకు తీవ్ర గాయమైంది. ప్రస్తుతం ఆయన విశాఖ కేజీహెచ్‌లో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. కలిగొట్లలో తన చెల్లెలు యడ్ల పుష్ప ఇంటికి తీర్థానికి శుక్రవారం ద్విచక్ర వాహనంపై వెళ్లిన శంకరరావు రాత్రి భోజనం చేసిన తర్వాత భార్య, పిల్లల్ని తీసుకొని ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో అతను రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. అతని భార్య, పిల్లలు కూడా గాయపడ్డారు. వ్యవసాయ కూలిగా జీవనం సాగిస్తున్న శంకరరావుకు భార్య లక్ష్మితో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. అతని తల్లి మంగమ్మ కూడా ఇతనిపైనే ఆధార పడి ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు దేవరాపల్లి ఎస్‌ఐ డి.నాగేంద్ర తెలిపారు.

గ్రామ స్వరాజ్యం సీఎం జగన్‌తోనే సాకారం



సచివాలయం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి



కోలాటం ఆడుతున్న డిప్యూటీ సీఎం

- సంక్షేమాభివృద్ధిలో అప్పలరాజుపురం గ్రామం
- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

చీడికాడ : మహాత్ముడు కలలు కన్న గ్రామస్వరాజ్యం ఏపీలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని, అందుకు నిదర్శనంగా పుట్టి పెరిగిన గ్రామంలోనే అన్ని రకాలు సేవలు అందించే సచివాలయాల వ్యవస్థ నిలుస్తుందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. అప్పలరాజుపరంలో శనివారం అప్పలరాజుపురం నుంచి జైతవరం ఉప్పరుగూడెం వరకు 4 కిలోమీటర్ల మేర రూ.1.45 కోట్లతో నిర్మించిన తారురోడ్డుకు, అప్పలరాజుపురం నుంచి కె.జె.పురం వరకు 2.5 కిలోమీటర్లు మేర రూ.65 లక్షల నిధులతో నిర్మించిన తారు రోడ్డుకు శిలాఫలకాలను ఆవిష్కరించి ప్రారంభించారు. అప్పలరాజుపురంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం భవనం, రూ. 23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాల రిబ్బన్‌లు కట్ చేసి ప్రారంభింపజేశారు. శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఎంపీపీ పాఠశాలలో రూ.44 లక్షలతో పూర్తి చేసిన పనులు, జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.64 లక్షలతో పూర్తి చేసిన పనులను పరిశీలించారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీ ప్రకారం అప్పలరాజుపురం గ్రామంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. మెట్టమీది శివాలయం నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు అందించడంతో పాటు మరో రూ.10 లక్షలు టీటీడీ నుంచి కేటాయించేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం శివాలయం నిర్మాణం పూర్తి చేసుకుని ప్రాణప్రతిష్ఠకు చేరుకుంది. ఈ నాలుగున్నరేళ్లలో మరో రూ.35 లక్షలతో డ్రైన్లు నిర్మించి గ్రామ అవసరాలు తీర్చినట్టు చెప్పారు. అంతకుముందు గ్రామస్తులు డిప్యూటీ సీఎంకు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బూడి గ్రామస్తులతో కలిసి కోలాటం ఆడారు. కార్యక్రమంలో సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు, ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, మండల వైయస్‌ఆర్‌సీపీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, యువజన విభాగం అధ్యక్షుడు స్వామినాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, షేకు సూర్యనారాయణ, కురచా నారాయణమూర్తి పాల్గొన్నారు.

అది సొరంగం కాదు

- రాతి బండల మధ్య ఏర్పడిన ఖాళీ మాత్రమే
- కొమిరలో సొరంగాన్ని పరిశీలించిన పురావస్తుశాఖ అధికారులు



సొరంగంలోకి ప్రవేశిస్తున్న పురావస్తు శాఖ అధికారి ఫల్గుణరావు, ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు

రావికమతం : మండలంలోని కొమిర గ్రామంలో వారం రోజుల క్రితం బయల్పడిన సొరంగాన్ని విశాఖ పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఫల్గుణరావు, సిబ్బంది శనివారం సందర్శించారు. తహసీల్దార్ మహేశ్వరరావు, ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు సహాయంతో సొరంగం వద్దకు చేరుకున్నారు. సొరంగంలోకి దిగేందుకు పొడవైన నిచ్చెన, తాడు ఇతర పరికరాలు సిద్ధం చేశారు. 108 వాహనం ముందస్తుగా సిద్ధం చేశారు. ఆపై ఏడీ ఫల్గుణరావు, ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు, గ్రామానికి చెందిన మరో యువకుడు టార్చిలైట్లు, రక్షణ సామాగ్రితో సొరంగంలోకి దిగి పరిశీలించారు. 10 అడుగులు దిగి పరిశీలించగా అక్కడి నుంచి ఎడమ పక్కకు మరో 5 అడుగులు ఇరుకైన గుహ మాదిరి సాధారణంగా ఏర్పడిన రాతి బండల గ్యాప్ కన్పించిందన్నారు. సమీపంలో ఉన్న ఊరమెట్టకు దిగువ రాతి బండలు ఒకదానికొకటి రాపిడి, నీటి ప్రవాహం వల్ల ఎపుడో ఇలా గుహమాదిరిగా గ్యాప్ వచ్చి ఉంటుందని తెలిపారు. పూర్వీకుల సమయంలో తవ్వకాలు జరిగినట్టుగా ఎటువంటి ఆధారాలు లభించలేదని ఆయన వివరించారు. ఇకపై ఈ గొయ్యిని పూడ్చివేయాలని తహసీల్దార్ మహేశ్వరరావు, ఎస్‌ఐ ఉమామహేశ్వరరావుకు, సర్పంచ్ గొర్లె రవికుమార్‌కు సూచించారు.

ఉత్తమ సాగు పద్ధతులతో అధిక దిగుబడి



రైతులకు సూచనలు చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

పొలంబడిలో జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

కె.కోటపాడు: రైతులు ఉత్తమ వ్యవసాయ పద్ధతులను అవలంబించడంతోనే అధిక దిగుబడి పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు తెలిపారు. మండలంలోని వారాడలో పొలంబడి కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. వేరుశనగ పంటకు రెండో గొప్పు సమయంలో ఎకరానికి 200 కిలోల జిప్సం వేయాలని సూచించారు. తద్వారా పంటలో నూనెశాతం పెరుగుతుందన్నారు. అనంతరం చిరికివానిపాలెంలో భార్గవ్ ఎఫ్‌పీవోను గంధం ఆగ్రోస్ సంస్థ యజమాని గంధం సునీతతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో భార్గవ్ ఎఫ్‌పీవో చైర్‌పర్సన్ లాలం అచ్చంనాయుడు, ఏవో సోమశేఖర్, రైతులు లెక్కల ముత్యాలనాయుడు, తాతారావు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో చెక్‌పోస్టులు

విశాఖ సిటీ: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీస్ శాఖ ముందుస్తు భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమైంది. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, నగదు తరలింపు, అక్రమ మద్యాన్ని నియంత్రణపై దృష్టి సారించింది. నగరంలోకి వచ్చే సరిహద్దు ప్రాంతాలైన పద్మనాభం వద్ద చిన్నాపురం జంక్షన్, ఆనందపురం పరిధిలో భీమిలి క్రాస్ రోడ్, గోపాలపట్నం పరిధిలో అడవివరం, దువ్వాడ పరిధిలో అగనంపూడి, పెందుర్తి పరిధిలో సరిపల్లి ప్రాంతాల్లో ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటుచేసింది. ఈ చెక్‌పోస్టులను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్టుల పనితీరు, అక్కడ వసతులను పరిశీలించారు.

బెల్లం అచ్చుల రూపంలో గంజాయి

- వాహన తనిఖీల్లో పట్టుబడ్డ వైనం
- పోలీసుల అదుపులో నలుగురు వ్యక్తులు
- 54 కిలోల గంజాయి, రూ.1.89 లక్షల నగదు స్వాధీనం
- గంజాయి విలువ రూ.8 లక్షలుగా అంచనా



గంజాయి, సీజ్ చేసిన వాహనాలతో సీఐ అప్పలనాయుడు, ఎస్‌ఐ ఎల్.సురేష్

రోలుగుంట : గంజాయి వ్యాపారులు ఎప్పటికప్పుడు గంజాయి తరలింపులో కొత్త తరహా మార్గాలు చేపడుతున్నారు. తాజాగా వివిధ సైజుల్లో బెల్లం అచ్చుల మాదిరిగా గంజాయిని ఉంచి వాటిని వాహనాల్లో గుట్టుగా తరలించాలని ప్రయత్నించి శనివారం పోలీసులకు పట్టుబడ్డారు. కొత్తకోట సీఐ ఎల్ అప్పలనాయుడు ఆదేశాలతో ఎస్‌ఐ ఎల్.సురేష్ రాజన్నపేట సరిహద్దుల్లో మందస్తు సమాచారంతో వాహనాలు తనిఖీలు నిర్వహించినపుడు టాటా ఏస్ ట్రావెల్స్ వ్యాన్‌లో ఒక సీక్రెటు అరలో రెండు కిలోల బరువు గల 27 అచ్చులను గుర్తించారు. దీంతో సంబంధం ఉన్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని 54 కిలోల గంజాయి (27 గంజాయి అచ్చులను), నిందితుల వద్ద నుంచి రూ.1.89 లక్షలు నగదును స్వాధీనం చేసుకొన్నారు. గంజాయి రవాణాకు వినియోగించిన వ్యాన్‌తో పాటు ఒక స్కూటీని సీజ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివి. చింతపల్లి మండలం కిట్టుగొండ గ్రామానికి చెందిన కొర్రా సుబ్బారావు ఈ ప్రాంతంలో పశువులను కొనుగోలు చేసి నిజామాబాద్ తరలించి విక్రయాలు చేసేవాడు. ఈ క్రమంలో నిజామాబాదుకు చెందిన మహమ్మద్ నయీముద్దీన్‌తో స్నేహం కుదిరి గంజాయి వ్యాపారంలోకి దిగాడు. జి.మాడుగుల మండలానికి చెందిన వంతల సింహాద్రితో కలిసి గంజాయిని సిద్ధం చేశాడు.

దానిని తరలించడానికి నయీముద్దీన్ (52), పశుల సుకమార్(31), ట్రావెల్ వ్యానుతో ఈ నెల 18న నిజామాబాద్‌లో బయలుదేరి 19 తేదీకి ఇక్కడకు చేరుకున్నారు. కొర్రా సుబ్బారావు(26), వంతల సింహాద్రి(31)ని కలుసుకొని గంజాయిని వ్యాన్‌లో సీక్రెట్ అరలో దాచి బయలుదేరారు. మార్గమధ్యంలో పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. దీంతో ఈ వ్యవహారంలో సంబంధం ఉన్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు కొత్తకోట సీఐ విలేకరులకు వివరించారు.

క్రీడాకారులను ప్రోత్సహించడానికే 'ఆడుదాం ఆంధ్రా'

మండల స్థాయి విజేతలకు బహుమతులు అందజేసిన ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



చోడవరంలో విజేతలకు క్రీడా కిట్లు, బహుమతులు అందజేస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం: క్రీడాకారులను ప్రోత్సహించి, వారి ఉన్నతికి తోడ్పడాలన్న ఆశయంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం..ఆంధ్ర' క్రీడల పోటీలను నిర్వహించారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆడుదాం ..ఆంధ్ర మండలస్థాయి పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. చోడవరం మండలంలో 28 సచివాలయాల పరిధిలో జరిగిన పోటీల్లో ఎంపికైన టీమ్‌లు మండల స్థాయి పోటీల్లో పాల్గొన్నాయి. ఈ పోటీల్లో మహిళలు, పురుషుల విభాగాల్లో విజేతలను ప్రకటించి వారికి బహుమతులు అందజేశారు. క్రికెట్ పోటీలో పురుషుల విభాగంలో చోడవరం సచివాలయం -1, మహిళల విభాగంలో లక్ష్మీపురం సచివాలయం విజేతలుగా నిలిచారు. కబడ్డీలో అంకుపాలెం(పురుషులు), చోడవరం -4 (మహిళలు), ఖోఖో పోటీల్లో లక్ష్మీపురం (పురుషులు), లక్ష్మీపురం (మహిళలు), వాలీబాల్ పోటీల్లో లక్కవరం (పురుషులు), గవరవరం (మహిళలు),బాట్మింటన్ పోటీల్లో చోడవరం -3 (పురుషులు), జన్నవరం (మహిళలు) విజేతలుగా నిలిచారు. వీరంతా త్వరలో జరగనున్న నియోజకవర్గస్థాయి క్రీడా పోటీల్లో ఆయా మండలాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ పోటీల్లో పాల్గొంటారు. వీరికి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ బహుమతులు అందజేశారు. ఆయా విభాగాల్లో ప్రభుత్వం సమకూర్చిన క్రీడా కిట్లు, షీల్డులు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, ఈఓపీఆర్‌డి చైతన్య, సర్పంచ్‌లు నాగులాపల్లి రాంబాబు, శీరంరెడ్డి వెంకటరమణ, అర్జునరావు, శిరుచోళ్ల గణపతినాయుడు, మండల విద్యాశాఖాధికారిణి జయలక్ష్మి, పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే వేడుకలకు టి.నగరపాలెం సర్పంచ్



పొట్నూరు ఛాయాగౌతమి

తగరపువలస: ఢిల్లీలో ఈ నెల 26న జరిగే రిపబ్లిక్ డే వేడుకలకు భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీ సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమికి ఆహ్వానం అందింది. రాష్ట్రానికి చెందిన 15 పంచాయతీల సర్పంచ్‌లకు 9 విభాగాల్లో ఎంపిక చేసి ఆహ్వానాలు అందగా.. 'మంచి పాలనతో పంచాయతీ'విభాగంలో ఛాయాగౌతమికి ఈ అవకాశం దక్కింది. గతేడాది ఏప్రిల్ 24న జరిగిన జాతీయ పంచాయతీ దినోత్సవంలో ఇదే విభాగంలో ఆమెకు ఉత్తమ పంచాయతీ పురస్కారం లభించింది.

క్లుప్తంగా

మహిళలకు చట్టాలపై అవగాహన తప్పనిసరి



సదస్సులో మాట్లాడుతున్న శ్రీవిద్య

అనకాపల్లి: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా జడ్జి ఎస్.శ్రీవిద్య సూచించారు. మహిళలపై లైంగిక వేధింపుల చట్టం–2023పై మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గవరపాలెం చినహైస్కూల్లో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పోక్సో చట్టం గురించి వివరించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశ యాప్‌కు మంచి ఆదరణ లభించిందన్నారు. దిశ యాప్‌కు పెద్ద ఎత్తున మహిళల నుంచి అధికంగా కాల్స్ వస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపల్ జడ్జి జి.గంగరాజు, సివిల్ జడ్జి పి.ప్రదీప, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.వి.విజయలక్ష్మి, డీఎస్పీ వి.సుబ్బరాజు, డీఅండ్‌హెచ్‌వో ఎ.హేమంత్, జెడ్పీ ఎస్.వెంకటరమణ, తహసీల్దార్ గంగాధరరావు, సామాజిక ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు, మున్సిపల్ కార్మికులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రపర్వం.. స్వామి రూపం



ప్రత్యేక అలంకరణలో ధ్యాన వేంకటేశ్వరుడు

కశింకోట: ధ్యాన వేంకటేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. కశింకోటలోని ఆలయంలో స్వామిని పుష్పమాలలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

కొనసాగుతున్న న్యాయవాదుల దీక్షలు

అనకాపల్లి : బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల దీక్షలు శనివారం కొనసాగాయి. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ ప్రభుత్వం భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖరమంత్రి సాయిలక్ష్మణ, న్యాయవాదులు సుర శ్రీనివాస్, ఆర్‌డీపీ ప్రసాద్, గేదెల నాగేశ్వరరావు, సుంకర శ్రీనివాస్ పాల్గొన్నారు.

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 3,685 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,720	4,340
మొదటి రకం	3,630	4,100
రెండో రకం	3,450	3,700
మూడోరకం	3,130	3,440

అనకాపల్లి సినిమాలు

గుంటూరు కారం	రాజా
గుంటూరు కారం	సత్యనారాయణస్క్రీన్-1
హనుమాన్	సత్యనారాయణస్క్రీన్-2
నా సామిరంగ	షిర్డిసాయి
సైంధవ్	పర్తిసాయి
సలార్ (రెండుషోలు)	వెంకటేశ్వర
గుంటూరు కారం(రెండుషోలు)	
నా సామిరంగ	శ్రీసత్య
హనుమాన్	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 104 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. 'ఎ' పాజిటివ్–10 యూనిట్లు, 'బి' పాజిటివ్–22 యూనిట్లు, 'బి' పాజిటివ్–61 యూనిట్లు, 'ఎబి' పాజిటివ్–7 యూనిట్లు, 'ఒ' నెగెటివ్–3 యూనిట్లు, 'ఎబి' నెగెటివ్–1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 307 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 511 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.



అమ్మవారి రథం వద్ద భరత్‌కుమార్‌ను సన్మానిస్తున్న పార్టీ నేతలు, ఉత్సవ కమిటీ సభ్యులు



రథోత్సవం ముందు మహిళల కోలాటం



ఆకట్టుకున్న గిరిజన నృత్యాలు

కనులపండువగా.. గౌరీపరమేశ్వరుల జాతర

- మిరుమిట్లు గొలిపిన విద్యుద్దీపాలంకరణ
- ఆకట్టుకున్న వేషధారణలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

గౌరీపరమేశ్వరుల జాతర కనులపండువగా జరిగింది. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. రాజకీయ నాయకులతో పాటు పట్టణ ప్రముఖులు జాతరకు విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. పోలీసుల బందోబస్తు నడుమ జాతర ప్రశాంతంగా జరిగింది.



ఆకట్టుకున్న వేంకటేశ్వరస్వామి వేషధారణ

అనకాపల్లి : స్థానిక వేల్పుల వీధి గౌరీపరమేశ్వరుల జాతర శనివారం ఘనంగా ప్రారంభమైంది. అమ్మవారి ఆలయానికి తెల్లవారుజాము నుంచి వందల సంఖ్యలో భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. అమ్మవారి రథోత్సవాన్ని 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, రమేష్ దంపతులు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ దర్శించుకున్నారు. అంతకు ముందు ఆయనను ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించి అమ్మవారి చిత్రపటంతో ఘనంగా సత్కరించారు. ఈయన వెంట కార్పొరేటర్లు మందపాటి సునీత, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, యశోద దంపతులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, యువజన అధ్యక్షుడు ఉగ్గిన అప్పారావు, ఉపాధ్యక్షుడు మద్దాల రమణబాబు, పార్టీ శ్రేణులు బొండా వాసు ఉన్నారు. రాజకీయ ప్రముఖులు దాడి వీరభద్రరావు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణతో పాటు టీడీపీ నేతలు దర్శించుకున్నారు. సాయంత్రం పూలదండల అలంకరణలో అమ్మవారి ఆలయాన్ని అందంగా అలంకరించారు. సాము గరిడీ, తప్పెటగుళ్లు, తోడపెద్దు సేవ, కాళీమాత నృత్యాలు, పులివేషాలు, దేవతామూర్తుల ఆకృతుల్లో నేలవేషాలు జాతర ప్రియులను ఆకట్టుకున్నాయి. ప్రధాన రహదారిలో వేల్పులవీధి వద్ద దేవతామూర్తుల విద్యుత్ సెట్టింగ్‌తో పాటు కనులు మిరుమిట్లు గొలిపే విధంగా లైటింగ్ ఆకట్టుకుంది. రాత్రి 10 గంటల నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఎన్టీఆర్ క్రీడా మైదానంలో మందుగుండు విన్యాసాలు తిలకించేందుకు మైదానమంతా జనసంద్రమైంది. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పట్టణ సీఐ జి.శంకరరావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. జాతరకు సహకరించిన అన్ని శాఖల అధికారులకు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వాకాడ బాబు, కార్యదర్శి మద్దాల నూకరాజు, ఉపాధ్యక్షుడు శీరంశెట్టి నర్సింగరావు, కోశాధికారి వేల్పుల గణేష్, సహాయ కార్యదర్శి పనసా శ్రీకాంత్, సభ్యులు వాకాడ నర్సింగరావు, అమరపల్లి కృష్ణాజీ, ముత్తా శ్రీనివాసరావు, కందికొండ శంకరరావు, గరికి వెంకటరావు, కందికొండ సురేష్ కృతజ్ఞతలు తెలిపారు.



జాతరకు పోటెత్తిన భక్తులు



జాతరలో చిన్నారుల ఆట వస్తువుల అమ్మకాలు

పేదలకు గృహయోగం సీఎం జగన్ చలవే



మహిళకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందిస్తున్న జానకీరామరాజు

అనకాపల్లి : నిరుపేదలకు టిడ్కో గృహాలు అందించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అన్నారు. 82వ వార్డు పరిధి సచివాలయం–2లో శనివారం టిడ్కో గృహ లబ్ధిదారులకు ఆయన ఇంటి తాళాలతో పాటు రిజిస్ట్రేషన్ పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నేతలు ఎన్నికల ముందు టిడ్కో గృహాలు హడావుడిగా నిర్మించి పేదలకు అందని ద్రాక్షగా మార్చారని విమర్శించారు. ప్రజా సంకల్ప యాత్ర ద్వారా వారి కళ్లల్లో ఆనందం చూడాలనే సంకల్పంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా లక్షల సంఖ్యలో గృహాలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పలకా సత్యనారాయణ, ఉగ్గిన నర్సింగరావు, ఆడారి శ్రీనివాసరావు, అల్లు త్రినాథ్, ఉగ్గిన శ్రీనివాసరావు, పలకా వాసు, దొడ్డి హరిబాబు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న కల్యాణం

నక్కపల్లి : డొంకాడ గ్రామంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం శనివారం నేత్రపర్వంగా జరిగింది. ప్రతి ఏటా సంక్రాంతి అనంతరం ఇక్కడ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం అంగరంగవైభవంగా నిర్వహిస్తారు. ఈ కల్యాణం తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాదిమంది భక్తులు తరలివస్తారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తిలను ఉదయం గ్రామంలో ఊరేగించారు. అనంతరం వందలాది మంది భక్తుల సమక్షంలో స్వామివారికల్యాణ ఘట్టాన్ని అర్చక స్వాములు వైభవంగా నిర్వహించారు. స్వామివారికి భక్తులు కానుకలు, మొక్కుబడులు సమర్పించుకున్నారు. వివిధ భజన బృందాలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

చురుగ్గా నూకాంబిక ఆలయ నిర్మాణం



సమావేశంలో మాట్లాడుతున్న మురళీకృష్ణ, ప్రసాద్

అనకాపల్లి: గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నట్లు ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్ చెప్పారు. ఈవో కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటికే రూ.10 కోట్లతో ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రహదారిని ఆనుకొని ఉన్న దక్షిణం వైపు రాజగోపురాన్ని రూ.కోటి 71లక్షలతో నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. క్యూ కాంప్లెక్స్‌తో పాటు విశాలంగా మండపం నిర్మాణ పనులు రూ.కోటి 60 లక్షలతో జరుగుతున్నాయన్నారు. సీజీఎఫ్ నిధుల నుంచి రూ.3 కోట్ల 31 లక్షలు మంజూరు చేయాలని మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కోరగా, ఆయన రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి, దేవదాయ ధర్మాదాయశాఖ కమిషనర్ల దృష్టికి నిధులు మంజూరు విషయాన్ని తీసుకెళ్లారన్నారు. మంత్రి అమర్‌నాథ్‌కు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

సీఎం సభను విజయవంతం చేయాలి

పార్టీ శ్రేణులతో మలసాల భరత్‌కుమార్



సమావేశంలో మాట్లాతున్న భరత్‌కుమార్



మాట్లాడుతున్న ప్రసాద్



హాజరైన నేతలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు

అనకాపల్లి : ఎన్నికల శంఖారావంలో భాగంగా భీమిలిలో జరిగే సభను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కోరారు. స్థానిక రింగ్‌రోడ్డు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ క్యాంపు కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అధ్యక్షతన శనివారం నియోజకవర్గ పార్టీ శ్రేణులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 27న భీమిలిలో జరిగే సభకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. సభకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. నియోజకవర్గం నుంచి 73 సచివాలయాల పరిధిలో పార్టీ శ్రేణులతో వంద బస్సులు బయల్దేరతాయన్నారు. పార్టీ విజయానికి గ్రామ స్థాయి నుంచి ప్రతి ఒక్కరూ పాటు పడాలని సూచించారు. గ్రూపు రాజకీయాలు ఏర్పడితే తన దృష్టికి తీసురావాలని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గం నుంచి సుమారు 7 వేల మంది సభకు వస్తున్నట్లు చెప్పారు. జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా ఎన్నికల శంఖారావాన్ని ఉత్తరాంధ్ర జిల్లా భీమిలి నుంచి మొదలవుతుందన్నారు. నియోజకవర్గంలో 2024 సార్వత్రిక ఎన్నికలను నాయకులు, కార్యకర్తలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పట్టణ, మండల, కశింకోట మండల విస్తృతస్థాయి సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సచివాలయం పరిధిలో ఒక బస్సు సభకు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ కొంత మంది వ్యక్తులు పదవులను అనుభవించి, ఇతర పార్టీల జెండా పట్టుకోవడం సిగ్గు చేటన్నారు. భారతదేశంలో ఎన్నడూ చూడని 206 అడుగుల రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభించి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు న్యాయం చేసింది తమ ప్రభుత్వమేనన్నారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు, రాష్ట్ర వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనర్సింహారావు మాట్లాడారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణ అప్పారావు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, యువజన విభాగం అధ్యక్షుడు ఉగ్గిన అప్పారావు, వేగి త్రినాథ్, కశింకోట, అనకాపల్లి మండల అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద్, మలసాల కిశోర్, కశింకోట ఎంపీపీ కలగా లక్ష్మి, దేవాలయాల చైర్మన్లు కేఎం నాయుడు, కొణతాల మురళీకృష్ణ, ఆళ్ల నాగేశ్వరరావు, కశింకోట జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, చైర్మన్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేడు సీతారాముల తీర్థ మహోత్సవం

ఆకట్టుకుంటున్న దీపాలంకరణ

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో సీతారాముల తీర్థ మహోత్సవాన్ని ఆదివారం పెద్ద ఎత్తున నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. మండలంలో జరిగే సంక్రాంతి తీర్థాల్లో పెద్ద తీర్థంగా పేరొందిన ఈ ఉత్సవానికి మండలంలోని గ్రామాల నుంచి ప్రజలు ఉత్సాహంగా హాజరవుతారు. ఏటా సంక్రాంతి నుంచి ఆరు రోజుల తర్వాత తీర్థాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆ క్రమంలోనే ఈ ఏడాది అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా విద్యుద్దీపాలంకరణతో దేవతామూర్తుల కటౌట్లను ఏర్పాటు చేశారు. ప్రవేశ ద్వారాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. పిల్లల కోసం జెయింట్ వీల్, రంగుల రాట్నాలు, వినోదం కోసం రెండు డ్యాన్స్ ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేశారు.



తాళ్లపాలెంలో విద్యుద్దీపాలంకరణతో ఏర్పాటు చేసిన దేవతామూర్తుల కటౌట్లు

ఓటుహక్కుపై అవగాహన



మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లి : స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శనివారం దివ్యాంగులకు ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఓటు ప్రాధాన్యతను వివరించారు. ఐదేళ్లకోసారి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకుని తమకు మేలు చేసే నాయకుడిని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది, దివ్యాంగులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు కిట్ అందజేత

అనకాపల్లి : ఆడుదాం–ఆంధ్రా క్రీడలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టారని ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలో తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీ గ్రౌండ్‌లో శనివారం జరిగిన క్రికెట్ పోటీల్లో మామిడిపాలెం–తుమ్మపాల జట్ల మధ్య ఉత్కంఠభరిత పోటీ నెలకొంది. చివరకు తుమ్మపాల జట్టు విజేతగా నిలిచింది. గెలుపొందిన జట్టును వారిద్దరూ అభినందించి క్రికెట్ కిట్ అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు, ఎంపీటీసీ వద్దాది భారతిఅశోక్, పార్టీ శ్రేణులు పదాల గణపతి, కనుబుద్ది శంకర్, ఎ.సత్యనారాయణ, ఎంపీడీవో కె.నర్సింహారావు, ఈవోపీఆర్డీ ధర్మారావు, వ్యాయామ ఉపాధ్యాయులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



విజేతగా నిలిచిన తుమ్మపాల జట్టుతో దిలీప్‌కుమార్, సూరిబాబు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తుమ్మపాల: మండలంలోని శంకరం జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామీణ ఎస్ఐ నర్సింగరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఇందిరమ్మ గృహ సముదాయానికి చెందిన కొత్తపల్లి కుమార్ తన బైక్‌పై సబ్బవరం వెళ్తుండగా.. అనకాపల్లి నుంచి వస్తున్న మరో ద్విచక్రవాహనదారుడు ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కుమార్‌తో పాటు మరో వ్యక్తి గాయపడినట్లు ఎస్ఐ తెలిపారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.



ఘటనాస్థలి వద్ద క్షతగాత్రులు

ఘనంగా డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ జన్మదినం

చీడికాడ: విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ జన్మదిన వేడుకలు శనివారం అప్పలరాజుపురంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పాల సొసైటీ వద్ద డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డెయిరీ డైరెక్టరు శీరంరెడ్డి సూర్యనారాయణ స్థానిక లలితాదేవి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు లాలం శారద జానకీరామ్, పార్టీ మండలాధ్యక్షులు గొల్లవిల్లి రాజుబాబు, సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు, పాల సొసైటీ అధ్యక్షుడు చుక్కా రమణ, మండల సచివాలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య, యూనిట్ మేనేజర్ గుల్లిపల్లి రాము పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందబాబు జన్మదినం సందర్భంగా కె.జె.పురం జంక్షన్‌లో సంతోషిమాత ఆలయ ఉచిత అన్నదాన సత్రం వద్ద శనివారం అన్నసమారాధన నిర్వహించారు. చోడవరం మండలం అంబేరుపురానికి చెందిన దాడి సంతోష్, శిరీష దంపతులు ఆర్థిక సహకారంతో 200 మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు పాల్గొన్నారు.

మూడు పాఠశాలల్లో నవోదయ ప్రవేశ పరీక్ష

కశింకోట : కశింకోటలోని మూడు హైస్కూళ్లలో నవోదయ ప్రవేశ పరీక్ష శనివారం నిర్వహించారు. స్థానిక బాలికల హైస్కూల్, డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూల్, సెయింట్ జాన్స్ స్కూల్లో ఈ పరీక్ష జరిగింది. ఒక్కొక్క స్కూలుకి 216 మంది విద్యార్థులను కేటాయించారు. వీరిలో సుమారు వంద మంది గైర్హాజరయ్యారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ పరీక్షా కేంద్రాలను సందర్శించి సంతృప్తి చెందారు. హెచ్‌ఎంలు ఎం.ఎస్.స్వర్ణకుమారి, ఎంఆర్‌వీ అప్పారావు, ఎంఈవో మూర్తి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



బాలికల పాఠశాలలో పరీక్షల నిర్వహణ తీరును పరిశీలిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

ప్రజల్లోకి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమం

బుచ్చెయ్యపేట/రోలుగుంట: గ్రామాల అభివృద్ధితోపాటు పేదల సంక్షేమం కోసం పథకాలందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. శనివారం బుచ్చెయ్యపేట మండలం దిబ్బిడి, రోలుగుంటలో పార్టీ శ్రేణుల మండల స్థాయి విస్తృత సమావేశాలు వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన అవినీతి పాలనను, ప్రస్తుతం నీతిమంతమైన పరిపాలన విధానాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చైతన్యం తీసుకురావాలన్నారు. రాష్ట్ర ప్రజలు బాగుండాలంటే ముఖ్యమంత్రిగా జగనన్నను రెండో సారి గెలిపించేలా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈ నెల 25న భీమునిపట్నంలో సీఎం బహిరంగ సభకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు జోగా కొండబాబు, జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి పాల్గొన్నారు.

చురుగ్గా కులగణన

ఎస్.రాయవరం : గ్రామాల్లో కులగణన కార్యక్రమం శరవేగంగా జరుగుతోంది. మొదట్లో సర్వర్ ఇబ్బందులు గుర్తైనప్పటికీ గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది నేరుగా ఇళ్ల వద్దకు వెళ్లి సర్వే చేస్తూ వివరాలు సేకరణ చేస్తున్నారు. కొరుప్రోలు గ్రామంలో వీఆర్వో శ్రీధర్, వలంటీర్ల వివరాలు సేకరించారు. కులగణన నమోదు చేస్తున్నారు. మండలంలో రెండు రోజులుగా కులగణపై అవగాహన కల్పిస్తూ నమోదు చేస్తున్నారు.



కొరుప్రోలులో కులగణన సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది